వరకట్న వ్యవస్థ... సామాజిక రుగ్మత

ప్రాచీనకాలంలో మాతృస్వామిక వ్యవస్థ అమలులో ఉండేది. ఆ వ్యవస్థలో... కుటుంబ అధిపతి మహిళ. పిల్లలకు వారసత్వం తల్లి ద్వారా సంక్రమించేది. కుటుంబంలో, సమాజంలో స్త్రీకి ఎంతో గౌరవముండేది. వ్యవసాయం జీవనాధారంగా మారినప్పటి నుంచీ క్రమేణా పురుషాధిక్యత ప్రారంభమైంది. మాతృ స్వామిక కుటుంబ స్థానంలో.. పితృస్వామిక కుటుంబ వ్యవస్థ తెరపైకి వచ్చింది. నేటికి అదే వ్యవస్థ కొనసాగుతోంది. నేడు కుటుంబంలో, సమాజంలో.. మహిళల పరిస్థితి దిగజారింది. పాశ్చాత్య దేశాల్లో మహిళల పరిస్థితి కొంత మెరుగైనప్పటికీ.. సాంప్రదాయ సిద్ధమైన భారత్ వంటి దేశాల్లో మహిళల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది! ప్రజా వేదికలపై మహిళను మహాశక్తిగా ప్రస్తుతించడం.. నిజ జీవితంలో అన్నిరకాల అత్యాచారాలకు గురిచేయడం జరుగుతోంది. జనాభాలో మహిళల శాతం తగ్గడం, గృహ హింస పెరగడం వంటివి ఆందోళనకర పరిణామాలు!!



మన దేశంలో... గృహ హింస, భ్రూణ హత్యలు, గర్భస్రావం, వరకట్న వేధింపులు, హత్యలు, శారీరక, మానసిక హింస, బలవంతంగా వ్యభిచారంలోకి దించడం తదితర రూపాల్లో... మహిళలపై వేధింపులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం– మన దేశంలో ప్రతి 3 నిమిషాలకు ఒక మహిళలపై అత్యాచారం జరుగుతోంది. ప్రతి 29 నిమిషాలకు ఒక మాన భంగం.. ప్రతి 77 నిమిషాలకు ఒక వరకట్న మరణం సంభవిస్తోంది. ప్రతి 9 నిమిషాలకొకసారి ఒక వివాహిత మహిళ భర్త, అత్తమామలు, బావ, మరుదుల, ఆడబిడ్డల చేతిలో హింసకు గురవుతోంది. వివాహిత స్త్రీలలో 2/3 వంతుల మంది తమ జీవితంలో ఏదో ఒక సందర్భంలో గృహహింస బారిన పడుతున్నారు. 15–50 ఏళ్ల మధ్య వయసు వివాహిత మహిళల్లో... 70 శాతం మంది తమ భర్తల వల్లగాని, ఇతరుల వల్లగాని శారీరక హింసకు, మానభంగానికి, బలవంతంగా లైంగిక వేధింపులకు గురవుతున్నారు. గ్రామీణ మహిళల పరిస్థితి మరింత దారుణం. దీనికి ప్రధాన కారణాలు.. నిరక్షరాస్యత, చైతన్య లోపించడం. గృహ హింసలో బీహార్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. మిగతా రాష్ట్రాలతో పోల్చినప్పుడు హిమాచల్‌ప్రదేశ్‌లో గృహహింస తక్కువగా నమోదైంది. గృహ హింస కారణంగా సమాజం ఆర్థికంగా దెబ్బతింటుంది. బాధిత మహిళలు మానసికంగా కోలుకోవడం చాలా కష్టం. కుటుంబంపై, భావితరాలపై దాని ప్రతికూల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ మొత్తం గృహ హింసకు... మన దేశంలో కొనసాగుతున్న వరకట్న దురాచారమే మూలకారణం.

వరకట్న వ్యవస్థకు మూలం మన భారతీయ సాంప్రదాయ విధానమైన ''స్త్రీ ధనం''. ఇది తల్లి నుంచి కుమార్తెకు వారసత్వంగా సంక్రమిస్తుంది. ఇది ధనం, ఆస్తి, నగలు, వస్త్రాలు, కుటుంబ వ్యాపారంలో వాటా రూపంలో ఉంటుంది. అత్త మామలు ఇచ్చే బహుమతులు కూడా ఇందులో భాగమే. సంబంధిత మహిళ అనుమతితోనే ఆ సంపదను ఇతరులు అనుభవించడానికి వీలుంది. దీని ద్వారా కుటుంబంలో స్త్రీకి ఒక ప్రత్యేక గౌరవం, ఆత్మవిశ్వాసం కలుగుతుంది. దురదృష్టవశాత్తు.. కాలక్రమేణా ఇది వరకట్న పిశాచిగా మారింది. వివాహ సమయంలో వరుడి తరపువారు కోరిన లాంఛనాలను వధువు తరపువారు తమ తాహతుకు మించి తీర్చడానికి ప్రయత్నించడం... దాంతో వారి కుటుంబం ఆర్థికంగా చితికిపోవడం జరుగుతోంది. వివాహ సమయంలో జరిగిన ఒప్పందం మేరకు వరుడి గొంతెమ్మ కోర్కెలు తీర్చకపోతే... కోడలు, ఆమె తల్లిదండ్రులు అన్నిరకాల అవమానాలకు గురికావడం, కొన్ని సందర్భాల్లో హింసకు గురికావడం జరుగుతోంది.

అధికారిక అంచనాల ప్రకారం– ప్రతి ఏటా కనీసం 25 వేల మంది మహిళలువరకట్న అగ్నికి ఆహుతి అవుతున్నారు. 'స్త్రీ ధనం' కేవలం సంబంధిత మహిళకే చెందితే...ప్రస్తుత వరకట్న విధానంలో... భర్తకు, అత్తమామలకు.. పెండ్లి కుమార్తె చెల్లించే శుల్కంగా రూపాంతరం చెందింది. వివాహ విపణిలో.. వరుణ్ని, వధువు తరపువారు బహిరంగ వేలంలో కొనుక్కున్నట్లవుతోంది. ఇది వధువు, వరుడికి చెల్లించే ధర. గత పదేళ్లుగా ఆర్థిక వ్యవస్థ సాధించిన అభివృద్ధి కూడా వరకట్నంపై ప్రభావం చూపింది. అఖిల భారత సర్వీసులకు ఎంపికైన యువకులు కట్నంగా కోట్ల రూపాయలు డిమాండ్ చేయడం జరుగుతోంది. సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసే వారికి, విదేశాల్లో స్థిరపడిన భారతీయ సంతతికి.. వివాహ మార్కెట్‌లో గణనీయమైన గిరాకీ ఉంది. మహిళకు, వారి తరపు బంధువులకు వివాహం ద్వారా ఏర్పడిన బంధుత్వ

పరిచయంతో సామాజికంగా, ఆర్థికంగా ఎగబాకడానికి వీలవుతుంది. తమ కంటే ఎక్కువ హోదాలో ఉన్నవారితో వియ్యం.. సామాజికంగా, ఆర్థికంగా, కొన్ని సందర్భాల్లో రాజకీయంగా కూడా ఉపయోగపడుతుంది.

వరకట్న దురాచారం.. ఇటీవలి కాలం వరకు హిందూ సమాజంలోని మధ్య, ఉన్నత తరగతి వర్గాలకే పరిమితమై ఉండేది. కాని నేడది అన్ని వర్గాలకు పాకింది. ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలకు ఇదో శాపంగా పరిణమిస్తోంది. హర్యానా, పంజా బ్ వంటి రాష్ట్రాల్లో... స్త్రీ జనాభా గణనీయంగా తగ్గడానికి ఇది ఒక బలమైన కారణం. కట్నాలు ఇవ్వలేని వాళ్లు, అవివాహితు లైన ఆడపిల్లలు ఇంట్లో ఉన్నారనే అపవాదుకు గురయ్యే కంటే.. అసలు ఆడపిల్లలు లేకుండా ప్రయ త్నిస్తున్నారు. హర్యానాలోని రోహట్ జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోందంటే పరిస్థితి తీవ్రతను అర్థంచేసుకోవచ్చు. అలాంటి పరీక్షలు జరపడాన్ని చట్టపరంగా నిషేధించినప్పటికీ.. మద్యపాన నిషేధంలా ఇది కూడా విఫలమవుతోంది. సమాజంలో, ప్రభుత్వ యంత్రాంగంలో తగిన చిత్తశుద్ధి లేనంత కాలం ఎన్ని చట్టాలు చేసినా ఫలితం ఉండదు.

పరిష్కార మార్గమేమిటి?:

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ మహిళా సంక్షేమానికి, సాధికారతకు ఎన్నో చర్యలు ప్రభుత్వపరంగా, పౌర సమాజంపరంగా చేపట్టడం జరిగింది. రాజ్యాంగంలోని 14, 15 ప్రకరణలు... స్త్రీ, పురుషులకు సమానావకాశాలు కల్పించాయి. లింగపరమైన వివక్షను నిషేధించాయి. 39వ ప్రకరణ.. సమానమైన పనికి సమాన వేతన అవకాశాన్ని కల్పించి.. మహిళల ఆర్థిక సాధి కారతకు దోహదం చేసింది. వరకట్నాన్ని నిషేధిస్తూ.. 1961లోనే పార్లమెంటు చట్టం చేసింది. దాన్ని 1986లో సవరించారు. 2001లో మహిళా సాధికారతకు జాతీయ విధానం రూపొందించారు. వరకట్న నిషేధ చట్టం ప్రకారం– కట్నం తీసుకున్నవారికి, ఇచ్చిన వారికి ఐదేళ్ల వరకు జైలు శిక్షతోపాటు రూ. 15,000 జరిమానా విధించవచ్చు. వరకట్న చావుకు బాధ్యు లైనవారికి 7 ఏళ్ల నుంచి ఆజన్మాంత ఖైదు శిక్ష విధించవచ్చు. ఇండియన్ పీనల్ కోడ్ 304 'బి' నిబంధన ప్రకారం– వరకట్న నిందితులకు బెయిలు లభించదు.

ఇలాంటి కేసుల్లో... కట్నం కోసం పీడించలేదని నిందితులు నిరూపించుకోవాల్సి ఉంటుంది. గృహహింస నుంచి మహిళలకు రక్షణ కల్పిస్తూ రూపొందించిన చట్టం (2005)... వరకట్న పీడితులకు మరింత ఊరట కలిగించేందుకు ఉద్దేశించింది. మహిళా సంఘాలు, పౌర సమాజం మరింత కఠినమైన చట్టాలు రూపొందించి.. ఈ సామాజిక దురాచాన్ని నిర్మూలించాలని కోరుతున్నాయి. అయితే, అనేక సందర్భాల్లో వరకట్న నిషేధ చట్టాన్ని దుర్వినియోగం చేయడం కూడా జరుగుతోంది. కుటుంబంలో ఇతర కారణాల వల్ల ఏర్పడిన మనస్పర్థలను కూడా.. వరకట్న సంబంధ కేసులుగా చిత్రీకరించి.. భర్తను, అత్తమామలను ఇరికించిన సంఘటనలు లేకపోలేదు. ఈ సందర్భంలో పోలీసులు ఇరుపక్షాల నుంచి సొమ్ము చేసుకోవడం మనకు తెలిసిందే. కొన్ని సందర్భాల్లో అమాయకులు బలవుతున్నారు.

చట్టాల ద్వారా, ఉద్యమాల ద్వారా... తరతరాలుగా కొనసాగుతున్న ఆచారాన్ని అరికట్టడం కష్టం. అలాగని ఈ దురాచారాన్ని కొనసాగనివ్వాలని కాదు. సమాజంలో స్త్రీకి పురుషునితో పాటు సమానంగా ఆస్తిని వారసత్వంగా పొందే హక్కు కల్పించాలి. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలు ఈ మేరకు చట్టాలు చేశాయి. హిందూ వారసత్వ చట్టాన్ని సవరించి.. కుమార్తెల ఆస్తిని అన్యాక్రాంతం చేయడాన్ని నిషేధించాలి. యువతీ, యువకుల వైఖరిలో మార్పు రావాలి. వీటన్నిటికంటే తల్లిదండ్రులు తమ వివాహిత కుమార్తెలకు ఆదాయాన్నిచ్చే ఆస్తులను (పొలం, ఇల్లు, వ్యాపారంలో వాటా) కానుకగా ఇస్తే.. వారికి సాధికారత చేకూరుతుంది. విద్యా, వ్యాపార, రాజకీయ రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగి, వారికి స్వాధీనత లభించినప్పుడే వరకట్న దురాచారం సమసిపోతుంది!!

- గృహహింసలో మొదటి స్థానంలో ఉన్న రాష్ట్రం
  – బీహార్
- స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు కల్పిస్తూ రూపొందిన రాజ్యాంగ ప్రకరణలు
  – 14, 15
- మహిళల ఆర్థిక సాధికారతకు దోహదం చేసే రాజ్యాంగ ప్రకరణ – 39
- వరకట్నాన్ని నిషేధిస్తూ పార్లమెంట్ చట్టం రూపొందిన సంవత్సరం
  – 1961
- వరకట్న నిందితులకు బెయిల్ నిరాకరించే సెక్షన్
  – ఐపీసీ 304 'బి'
- గృహహింస నిరోధక చట్టాన్ని ప్రవేశపెట్టిన సంవత్సరం
  – 2005
- అధికారిక అంచనాల ప్రకారం ఏటా వరకట్న చావులకు గురవుతున్న వారి సంఖ్య
  – 25 వేలు
- లింగ నిర్ధారణ పరీక్షలతో వార్తల్లోకెక్కిన ప్రాంతం
  –హర్యానాలోని రోహట్ జిల్లా